కోనరావుపేట: మామిడిపల్లిలో పల్లె దవాఖాన శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్, న్యాలకొండ అరుణ

ప్రభుత్వ దవాఖానలోనే మెరుగైన వైద్య సేవలు

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- మామిడిపల్లిలో జడ్పీ చైర్‌పర్సన్‌తో కలిసి పల్లె దవాఖాన ప్రారంభం

కోనరావుపేట, డిసెంబర్ 29: ప్రభుత్వ దవాఖానలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కోనరావుపేట మండలంలోని మామిడిపల్లిలో రూ.20లక్షలతో నిర్మించిన పల్లె దవాఖానను జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ప్రజాపాలనలో ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే గ్రామాల్లో దరఖాస్తులను స్వీకరిస్తుందని పేర్కొన్నారు. పల్లె దవాఖానను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో అదనపు తరగతి గదులు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని ప్రధానోపాధ్యాయుడు కస్తూరి శ్రీనివాస్ ఎమ్మెల్యేను కోరారు. ఇక్కడ ఎంపీపీ చంద్రయ్యగౌడ్, డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు, సర్పంచ్ భారతి, సెస్ వైస్ చైర్మన్ తిరుపతి, ఎంపీడీవో రామకృష్ణ, వైద్యాధికారి వేణుమాధవ్, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పాషా పాల్గొన్నారు.

జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 29: జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సిరిసిల్లలోని 15వ వార్డులో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఆకునూరి శంకరయ్య, కౌన్సిలర్ విజయనిర్మల పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం జోడెద్దులా పాలన

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దులా ముందుకు తీసుకెళ్తామని ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో శ్రీనివాస్‌ను పాలకవర్గం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కేకే మహేందర్‌రెడ్డి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు జయంత్, కార్యదర్శి ప్రవీణ్, కోశాధికారి మహేందర్, మల్లి కార్జున్, విశ్వనాథం, శ్రీనివాస్, దయానంద్ పాల్గొన్నారు.

ఆశీర్వదిస్తూ.. ఆప్యాయంగా పలుకరిస్తూ

- సిరిసిల్లలో ఎమ్మెల్యే రామన్న పర్యటన

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ)/ సిరిసిల్ల టౌన్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ సిరిసిల్లలో శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. ఓవైపు శుభాకార్యాలు, మరోవైపు ఆప్తులను కోల్పోయిన కుటుంబాలను కలిసి పరామర్శించి 'నేనున్నా' అంటూ ధైర్యం చెప్పారు. వార్డులోని ప్రజలను కలిసి 'బాగున్నారా' అంటూ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలను ఆప్యాయంగా పలుకరించారు. ఆప్తులను కోల్పోయిన కుటుంబాలకు అండగా ఉంటానని భరోసానిచ్చారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు.

గుర్రం దేవదాస్ స్వామికి సన్మానం

44రోజుల పాటు శబరిమల అయ్యప్ప ఆలయానికి కాలినడకన వెళ్లి వచ్చిన అయ్యప్ప భక్తుడు గుర్రం దేవదాస్‌ను కేటీఆర్ శాలువా, మెమోంటోతో ఘనంగా సన్మానించారు. మాలధారణ దీక్షతో 18సంవత్సరాలు పూర్తి చేసిన సందర్భంగా కాలినడకన వెళ్లి అయ్యప్ప దర్శనం చేసుకున్న గురుస్వామికి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ అయ్యప్ప మాలధారణ చేసిన ఉపాధ్యాయులు నీలి శ్రీనివాస్, కన్నం రమేశ్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

సిరిసిల్లలోని జీవైనగర్‌లో చిన్నారులతో సరదాగా ఫొటో దిగుతున్న కేటీఆర్

మాజీ కౌన్సిలర్ అశోక్‌ను పరామర్శిస్తున్న కేటీఆర్

తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

సిరిసిల్లలో రాజన్న హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేటీఆర్

టీ-హబ్‌ను సందర్శించిన గిరిజన మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 29: హైదరాబాద్‌లోని టీ-హబ్‌ను తంగళ్లపల్లిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా స్టార్టప్స్ ఇన్నోవేషన్లు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. వర్క్‌షాప్‌లో విద్యార్థినులు ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదగడానికి కావల్సిన నైపుణ్యాలు, వనరులు తదతర అంశాలపై అవగాహన కల్పించారని ప్రిన్సిపాల్ రజిని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో అయ్యప్ప స్వాములకు గాయాలు

వేములవాడ, డిసెంబర్ 29: వేములవాడకు చెందిన అయ్యప్ప స్వాములు కారులో శబరిమలకు ప్రయాణిస్తుండగా ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం సమీపంలో ప్రమాదానికి గురయ్యారు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం అర్ధరాత్రి అనంతపురం సమీపంలో రహదారి నిర్మాణ పనులు జరుగుతుండగా మంచు కురుస్తున్న క్రమంలో ఆగి ఉన్న జేసీబీని అయ్యప్ప స్వాములు ప్రయాణిస్తున్న కారు ఢీ కొట్టింది. దీంతో పాశం భాస్కర్‌రెడ్డి, బాలుకు తీవ్ర గాయాలయ్యాయి. చిక్కుడు మల్లేశం, పిట్టల తిరుమల్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాయపడిన వారిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు.

వేములవాడ కళాకారులకు పురస్కారాలు

వేములవాడ టౌన్, డిసెంబర్ 29: ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా రేటాల లక్ష్మీనరసారెడ్డి మందిరంలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర కళాకారుల సాంస్కృతిక సమ్మేళనం గురువారం రాత్రి ఘనంగా జరిగింది. సమ్మేళనంలో వేములవాడకు చెందిన కళాకారులను సన్మానించి, పురస్కారంతో పాటు రూ.5 వేలను అందజేశారు. కళాతపస్వి, గాయకుడు ఎల్ల పోశెట్టి, రంగస్థల నటుడు బొడ్డు రాములు, సావనపెల్లి శ్రీనివాస్, గాయకులు నాదమునుల రామారావు, వారాల దేవయ్య, ఒగ్గు కళాకారుడు వనం రాజయ్య, రచయిత, కవి, గాయకుడు కనపర్తి హన్మాండ్లు, నటుడు చిలుముల రమేష్‌చారికి రాజ్యసభ సభ్యుడు బీదా మస్తాన్‌రావు, ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పురస్కారాలను అందజేశారు. కళాకారులను స్థానికులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

షీటీమ్స్‌పై విద్యార్థినులకు అవగాహన

గంభీరావుపేట, డిసెంబర్ 29: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు శుక్రవారం షీటీమ్స్ బృందం అవగాహన కల్పించారు. ఆకతాయిల వేధింపులను ఎలా ఎదుర్కోవాలో మహిళలు, విద్యార్థినులకు వివరించారు. కళాశాలలో ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌కు గురైతే మహిళలు, విద్యార్థినులు నిర్భయంగా షీ టీమ్స్‌ను సంప్రదించాలని ఎస్ఐ అంజయ్య తెలిపారు. అండగా ఉండి రక్షణ కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకట్ నాయక్, ఏఎస్ఐ ప్రమీల, కానిస్టేబుల్ ప్రియాంక, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

'మినీ యాదాద్రి' ప్రారంభోత్సవానికి రండి

- కేటీఆర్‌ను ఆహ్వానించిన ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 29: తంగళ్లపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో విగ్రహప్రతిష్ఠాపనోత్సవానికి (మినీ యాదాద్రి) రావాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్‌ను తంగళ్లపల్లి ప్రజాప్రతినిధులు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. శుక్రవారం సిరిసిల్లలో పర్యటించిన ఎమ్మెల్యే కేటీఆర్‌ను ప్రత్యేకంగా కలిసి, ఆహ్వాన పత్రికను అందించారు. జనవరి 3నుంచి 6 వరకు జరిగే మహోత్సవ కార్యక్రమానికి రావాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కేటీఆర్, ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాకి హాజరవుతానని తెలిపారు. ఈసందర్భంగా కేటీఆర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. వీరిలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, సీనియర్ నేతలు అంకారపు రవీందర్, పడిగెల రాజు, ఎంపీటీసీ కోడి అంతయ్య, మచ్చ ఆంజనేయులు, రాపెల్లి ఆనందం, ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు పెద్దూరి తిరుపతి, ప్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, నేరేల్ల అనిల్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే కేటీఆర్‌కు ఆహ్వాన పత్రికను అందిస్తున్న తంగళ్లపల్లి ప్రజాప్రతినిధులు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు

సేవా కార్యక్రమాలు ఎప్పటికీ నిలిచిపోతాయి

- బీఆర్ఎస్ నాయకుడు చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ, డిసెంబర్ 29: సేవా కార్యక్రమాలు ఎప్పటికీ ప్రజల్లో నిలిచిపోతాయని బీఆర్ఎస్ నాయకుడు చల్మెడ లక్ష్మీనరసింహారావు పేర్కొన్నారు. శుక్రవారం వేములవాడలోని ఆయన నివాసంలో రోమాల లక్ష్మణ్ ఫౌండేషన్ 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోమాల లక్ష్మణ్ ఫౌండేషన్‌ను మండలంలోని నూకలమర్రిలో ఏడాది క్రితం స్థాపించి, ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేస్తూ ప్రాణదాతగా నిలిచిన రోమాల ప్రవీణ్‌ను అభినందిస్తున్నామన్నారు. కాగా 50 సార్లు రక్తదానం చేసిన రోమాల ప్రవీణ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బండ మల్లేశ్‌యాదవ్, మండలాధ్యక్షుడు గోస్కుల రవి, మాజీ ఏఎంసీ చైర్మన్ గడ్డమ హన్మాండ్లు, మాజీ సర్పంచ్ పిట్టల వెంకటేశ్, యువజన సంఘాల ప్రతినిధి సామినేని బాలు, నాయకులు ఉన్నారు.

నూతన గృహప్రవేశానికి హాజరైన 'చల్మెడ'

కోనరావుపేట, డిసెంబర్ 29: మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన ఎంపీటీసీ కాశవేణి మమత- మహేశ్‌యాదవ్ దంపతుల నూతన గృహప్రవేశ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకుడు చల్మెడ లక్ష్మీనరసింహారావు, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ హాజరయ్యారు. ఇక్కడ ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, ఎంపీటీసీ నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.

రోమాల లక్ష్మణ్ ఫౌండేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు, ఎంపీపీ మల్లేశం యాదవ్

దేశ ఐక్యత మనందరి బాధ్యత

- ఇంటర్నేషనల్ ఓమౌజయా ఆధ్వర్యంలో విద్యార్థుల ర్యాలీ

సిరిసిల్ల పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): 'దేశ ఐక్యత మనందరి బాధ్యత. భారతీయతను ప్రపంచానికి చాటేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి' అని నినాదాలు చేస్తూ విద్యార్థులు సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఇంటర్నేషనల్ ఓమౌజయా యునైటెడ్ యంగ్ స్టార్స్ అసోసియేషన్ (ఐఏయూవైఎస్ఏ) సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వారం రోజులుగా స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నది. విద్యతో పాటు సంస్కారాన్ని పెంపొందించుకోవాలని, భారత సంస్కృతి సంప్రదాయాలు నలుదిశలా చాటాలంటూ అన్ని కళాశాలలకు చెందిన విద్యార్థులు మానేరు బతుకమ్మ ఘాట్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద భారతీయులందరూ కలిసి మెలసి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు తిరుమల రుషి మాట్లాడారు. దేశ జనాభాలో అత్యధిక శాతం యువతే ఉందన్నారు. శాస్త్రీయ దృక్పథం ఏర్పడితేనే రేపటి తరం అద్భుతమైన విజయాలను సాధించగలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యులు జేమ్స్, బుద్ధగౌడ్ పాల్గొన్నారు.

లైంగికదాడి యత్నం కేసులో నిందితుడికి జైలు

వేములవాడ, డిసెంబర్29: ఆరోగ్యం సరిగా లేని మానసిక దివ్యాంగురాలిపై మానవత్వం మరిచి లైంగిక దాడికి యత్నించిన బుక్క రామచంద్రం (55)కు రెండేళ్ల జైలు శిక్ష, రూ.పదివేల జరిమానా విధిస్తూ వేములవాడ ఇన్‌చార్జి న్యాయమూర్తి ప్రవీణ్ శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.. నియోజకవర్గంలోని ఓ మండల కేంద్రానికి చెందిన భార్యాభర్తలకు నలుగురు సంతానం. వీరిలో ముగ్గురికి పెళ్లిళ్లు జరిగాయి. చిన్న కూతురు మానసిక దివ్యాంగురాలు. ఆరోగ్యం సరిగా ఉండని అమ్మాయి(27)కి పెళ్లి కాకపోవడంతో ఇంటి వద్దనే ఉంటున్నది. 2018 ఫిబ్రవరి 2న తల్లిదండ్రులు బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉన్న అమ్మాయిపై బుక్క రామచంద్రం అలియాస్ రాములు లైంగిక దాడికి యత్నించగా అమ్మాయి అరవడంతో పారిపోయాడు. ఈ ఘటనపై బాధితురాలు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడు రామచంద్రంపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. ఈ కేసులో సాక్షులను వేములవాడ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ విక్రాంత్ కోర్టులో ప్రవేశపెట్టి విచారించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడు రామచంద్రానికి రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించారు.

మూతబడిన ప్రభుత్వ పాఠశాలలను పునఃప్రారంభించాలి

ఇల్లంతకుంట, డిసెంబర్ 29: మండలంలోని పలు గ్రామాల్లో మూతబడిన ప్రభుత్వ పాఠశాలలను పునఃప్రారంభించాలని అంబేద్కర్ యువజన సంఘాల రాష్ట్ర కార్యదర్శి సావనపెల్లి రాకేశ్ పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మహాత్మజ్యోతిబాపూలే ప్రజా భవన్‌లో రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశామని తెలిపారు.

బోయినపల్లి : మాట్లాడుతున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

ఏపని చేసినా గౌరవంగా బతకాలి

- విద్యార్థులు ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించాలి
- క్రీడలతోపాటు విద్య, వినయం ఉంటేనే ఉజ్వల భవిష్యత్
- కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

బోయినపల్లి, డిసెంబర్ 29: ఏపని చేసినా గౌరవంగా తలెత్తుకుని బతికేలా ఉండాలని, ఏపని చేస్తున్నామన్నది ముఖ్యం కాదని, ఎంత చిన్న పనిచేసినా విలువలతో ఉన్న పని చేసి తృప్తి పడాలని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ సూచించారు. విద్యార్థులు ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. బోయినపల్లి జడ్పీ పాఠశాల ఆవరణలో కోరెంకు చెందిన చెన్నాడి మార్తాండ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడలను శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు క్రీడలతోపాటు విద్య వినయం ఉంటేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని నిర్దేశం చేశారు. చెన్నాడి మార్తాండరావు కూడా చిన్నచిన్నగా కాంట్రా క్టు పనులు ప్రారంభించి పెద్ద వ్యాపార వేత్తగా ఎదిగి వేలాది మందికి ఉపాధినిచ్చారని చెప్పారు. మార్తాండరావు జీవిత చరిత్ర కూడా విద్యార్థులకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని సామాజిక కార్యక్రమాలు చేపడుతున్న ట్రస్టు చైర్మన్ చెన్నాడి రాజ్యలక్ష్మిని ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, బీఆర్ఎస్ జి ల్లా నాయకులు చెన్నాడి అమిత్‌కుమార్, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, ట్రస్టు సభ్యులు స్త్రీ వైద్యనిపుణురాలు డాక్టర్ బోయినపల్లి మాధవి, ఎంపీటీసీ సంబ బుచ్చమ్మ, మాజీ ఎంపీపీ సత్తినేని భాగ్యలత, ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలి

- జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

కోనరావుపేట, డిసెంబర్ 29: గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలని జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. మామిడిపల్లిలో రెండో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. వంటగదిలో నిత్యావసర సరుకులతో పాటు పిల్లలకు అందించే ఆహారాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్లు మెనూ ప్రకారం ఆహారం, గుడ్డు, పాలు అందించాలని సూచించారు. చిన్నారుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని ఆదేశించారు. ఇక్కడ ఎంపీపీ చంద్రయ్యగౌడ్, సర్పంచ్ కొక్కుల భారత, అంగన్‌వాడీ టీచర్ కస్తూరి స్వప్న, నాయకుడు కొక్కుల నర్సయ్య తదితరులు ఉన్నారు.

జక్కుల చెరువు నీటి విడుదల

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 29: నిండు కుండలా మారిన చెరువు గొల్లపల్లి, బొప్పాపూర్ ఆయకట్టుకు వరప్రదాయని అని సర్పంచుల ఫోరం కొండాపురం బాల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బాల్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు యాసంగి పంట కాలానికి జక్కుల చెరువు నీటిని విడుదల చేశారు. ఇక్కడ ఎంపీటీసీ ల్యాగల శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ దేవయ్య, నాయకులు ఉన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, డిసెంబర్ 29: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామివారి ఆలయం శుక్రవారం భక్తులతో రద్దీగా కనిపించింది. భక్తులు పవిత్ర స్నానాలు చేసి కల్యాణకట్టలో భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించుకున్నారు. రాజన్నకు ప్రీతికరమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. భక్తులు కుంకుమపూజలు, గండదీపం మొక్కులు, కల్యాణ మొక్కులు, సత్యనారాయణ వ్రతాలు, చండీహోమాలు ఘనంగా నిర్వహించారు. రాజన్నను పదివేల మందికి పైగా భక్తులు దర్శించుకోగా, వివిధ ఆర్జిత సేవల ద్వారా రాజన్నకు రూ.14 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

మేర సంఘం కార్యవర్గం ఎన్నిక

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 29: తెలంగాణ మేర సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఓదెల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పోలంపల్లి దేవేందర్, కోశాధికారిగా తెంబెరవేణి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా గట్ల మీనయ్య, కీర్తి మల్లేశం, నర్సయ్య, నాంపల్లి, దుర్గేశ్, సతీష్‌కుమార్, గట్ల కాశయ్య, మోతె రవి ఎన్నికయ్యారు.

రెండో రోజూ తాకిడి

- కొనసాగిన ప్రజాపాలన కార్యక్రమం
- పెద్దసంఖ్యలో దరఖాస్తుల వెల్లువ
- పాల్గొన్న అదనపు కలెక్టర్లు గౌతమి, ఖీమ్యానాయక్

కోనరావుపేట/వేములవాడ రూరల్/గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట/బోయినపల్లి/రుద్రంగి/ కోనరావుపేట/చందుర్తి/ సిరిసిల్ల రూరల్/ఇల్లంతకుంట/వీర్నపల్లి/ముస్తాబాద్, డిసెంబర్ 29: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమం రెండోరోజైన శుక్రవారం కూడా కొనసాగింది. పల్లెలో అధికారులు, ప్రజాప్రతినిధులు మహాలక్ష్మీ, గృహలక్ష్మీ, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, చేయూత పథకాలకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాపాలనలో అర్జీదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్లు గౌతమి, ఖీమ్యానాయక్ అధికారులను ఆదేశించారు. కోనరావుపేట మండలంలోని ధర్మారంలో గౌతమి, వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్, నాంపెల్లి వార్డుల్లో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమాన్ని ఖీమ్యానాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా దరఖాస్తుదారులతో ముచ్చటించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ధర్మారం, వేములవాడ తహసీల్దార్లు విజయ్‌ప్రకాశ్‌రావు, మహేశ్ ఉన్నారు. అలాగే ఆర్డీవో మధుసూదన్ ఆధ్వర్యంలో నాంపెల్లి, తిప్పాపూర్, ఆరెపల్లి, సంకెపల్లి, అచ్చన్నపల్లిలో దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. గంభీరావుపేట మండలంలోని గోరంటాల, నాగంపేట, జగదాంబ తండా, పొన్నాలపల్లెలో జడ్పీటీసీ విజయ, సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు దరఖాస్తులు స్వీకరించారు. ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్, అల్మాస్‌పూర్, బాకుర్‌పల్లితండా, గుంటపల్లి చెరువుతండాలో ఎంపీపీ పిల్లి రేణుక, జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, డీపీవో రవీందర్, తహసీల్దారు రామచంద్రం పాల్గొని ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. బోయినపల్లి మండలం దేశాయిపల్లి, దుంద్రపల్లి, జగ్గారావుపల్లిలో జరిగిన ప్రజాపాలనలో ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, తహసీల్దార్ పుష్పలత, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్ పాల్గొన్నారు. రుద్రంగి మండలం దేగావత్‌తండాలో ఎంపీడీవో శంకర్, సర్పంచు దేగావత్ సరిత, స్పెషలాఫీసర్ మోహన్‌రెడ్డి, ఎంపీవో సుధాకర్ ఆరు గ్యారంటీలకు గ్రామస్తుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కోనరావుపేట మండలంలోని ధర్మారం, మర్తనపేట, వట్టిమల్ల, గొల్లపల్లిలో తహసీల్దార్ విజయ్‌ప్రకాశ్‌రావు, ఎంపీడీవో రామకృష్ణ ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరించారు. శుక్రవారం నాలుగు గ్రామాల్లో 1432 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. మొత్తంగా రెండు రోజుల్లో ఎనిమిది గ్రామాల్లో 2508 అర్జీలు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గోపు పరశురాములు, సర్పంచులు పాల్గొన్నారు. చందుర్తి మండలంలోని తిమ్మాపూర్ రామన్నపేటలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రవీందర్ అర్జీలను స్వీకరించారు. తంగళ్లపల్లి మండలం బస్వాపూర్, చిన్నలింగాపూర్, చీర్లవంచ, చింతలఠాణాలో జడ్పీటీసీ మంజుల, ఇల్లంతకుంట మండలంలోని అరెప్లి గ్రామంలో తహసీల్దార్ జావిద్ అక్బర్, వీర్నపల్లి మండలం భూక్యాతండాలో ఆర్డీవో ఆనంద్‌కుమార్, డీపీవో రవీందర్, ఎర్రగడ్డతండా, గర్జనపల్లి, జవహర్‌నాయక్‌తండాలో అధికారులు, ముస్తాబాద్ మండలం చీకోడు, చిప్పలపల్లి, గోపాల్‌పల్లె, మొర్రాయిపల్లెలో ఎంపీపీ జనగామ శరత్‌రావు దరఖాస్తులను స్వీకరించారు.

నాంపెల్లిలో ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

గోరంటాలలో దరఖాస్తులు స్వీకరణను ప్రారంభిస్తున్న జడ్పీటీసీ విజయ, అధికారులు

కోనరావుపేట: ధర్మారంలో అధికారులకు సూచనలిస్తున్న అదనపు కలెక్టర్ గౌతమి